- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
తెలుగు దినపత్రిక
గురువారం
28-05-2026
సంపుటి : 01 సంచిక :66 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha
Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 66 NAMASTEY MAHAAPRABHA



# సర్ సక్రమమే!

### ఈసీ ప్రక్రియను అడ్డుకోలేం

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సుప్రీంకోర్టు
- ఓటరు జాబితా సవరణలకు ఈసీకి అధికారాలున్నాయి
- నిలిపివేయాలన్న విపక్షాల పిటిషన్ కొట్టివేత
- ఎన్నికల కమిషన్ నిర్ణయానికి ఆమోదముద్ర

**న్యూఢిల్లీ మే 27(మహ ప్రభ)**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియకు భారత అత్యున్నత న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాధారణ సవరణ ప్రక్రియకు భిన్నంగా ఉందన్న కారణంతో ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ను సమర్థిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

-మిగతా 3 లో

# అకాల వర్షాలు.. హై అలర్ట్!

### అధికారులను హెచ్చరించిన సీఎం రేవంత్ రెడ్డి


- తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసిన వాతావరణ శాఖ
- కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలన్న సీఎం
- మక్కలు, ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఏర్పాటు చేయాలి
- కొనుగోళ్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు



**హైదరాబాద్, మే 27(మహ ప్రభ)**

వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీవర్షాలు, ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని బుధవారం జరిగిన అధికారుల సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో

-మిగతా 3 లో




## చంద్రుడి దక్షిణ ధృవంపై మంచు!

- చంద్రయాన్-2 డాటా ఆధారంగా గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు

3



## ఎస్--400 మిస్సైల్స్ రక్షణ వ్యవస్థలు మరిన్ని కావాలి..

- నేడు సిద్ధరామయ్య రాజీనామా?
- సాయంత్రం 3 గంటలకు గవర్నర్
- అపాయింట్‌మెంట్ కోరిన సీఎం
- ముఖ్యమంత్రిగా డీకేకు అవకాశం

3



## త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

- ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి
- జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు
- కెటిఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మే 27(మహ ప్రభ)**

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం.

-మిగతా 3 లో

# తెలంగాణలో తహసీల్దార్ల బదిలీ





- రాష్ట్రవ్యాప్తంగా 12 మంది తహసీల్దార్ల బదిలీ
- డీఆర్ఓ, ఎస్‌డీసీ పోస్టుల్లో కొత్త నియామకాలు
- పరిపాలనా అవసరాలతో ప్రభుత్వం కీలక నిర్ణయం
- వెంటనే విధుల్లో చేరాలని అధికారులకు ఆదేశాలు

**తెలంగాణ బ్యూరో్రప్రతినిధి:మే 27(మహ ప్రభ)**

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పరిపాలనాపరమైన అవసరాల దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 12 మంది

-మిగతా 3 లో

# నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు



- వాతావరణ శాఖ హెచ్చరికలు
- ఉరుములు మెరుపులు ఈదురుగాలులకు అవకాశం
- పలు జిల్లాలలో ఆరెంజ్ హెచ్చరికలను జారీ
- ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని స్పష్టీకరణ

**హైదరాబాద్ మే 27(మహ ప్రభ)**

తెలంగాణ రాష్ట్రంలో కొద్ది రోజుల నుంచి పగటి పూట భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. సాయంత్ర సమయంతో మాత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కాస్త ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి.

-మిగతా 3 లో

## అట్టహాసంగా టిడిపి మహానాడు ప్రారంభం

- పార్టీ జెండా అవిష్కరించిన సిఎం చంద్రబాబు
- పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి
- హాజరైన పార్టీ ప్రముఖులు, పోలిట్ బ్యూరో సభ్యులు




**అమరావతి మే 27(మహ ప్రభ)**

తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు-2026 వేడుకలు అమరావతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకుని మహానాడు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. టీడీపీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావుకు నివాళులు అర్పించారు. ఈసారి మహానాడును పూర్తిగా సాంకేతికత ఆధారంగా పర్చువల్ విధానంలో

-మిగతా 3 లో

# కల్లాల వద్ద దైన్యంగా రైతులు

### వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి



- పంటల కొనుగోలు లేక దీనావస్థ
- బిఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి
- పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు

**హైదరాబాద్, మే 27(మహ ప్రభ)**

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతాంగానికి అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని

-మిగతా 3 లో



## 30న కర్ణాటకకు కొత్త సీఎం..

- నేడు సిద్ధరామయ్య రాజీనామా?
- సాయంత్రం 3 గంటలకు గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన సీఎం
- ముఖ్యమంత్రిగా డీకేకు అవకాశం

**బెంగళూరు మే 27(మహ ప్రభ)**

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం(మే 28) సాయంత్రం 3 గంటలకు తన పదవికి రాజీనామా చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. తన రాజీనామా సమర్పించడానికి గురువారం సాయంత్రం 3 గంటలకు ఆయన రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ అపాయింట్‌మెంట్ కోరినట్లు వర్గాలు తెలిపాయి. న్యూఢిల్లీలో మంగళవారం కాంగ్రెస్ అధిష్ఠాన వర్గంతో జరిగిన ఉన్నత స్థాయి చర్చల అనంతరం ఊహించిన ఈ చర్య ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రి పదవిని చేపట్టడానికి మార్గం సుగమం చేయనున్నది. కాగా, ముఖ్యమంత్రి

-మిగతా 3 లో

## సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ ఆన్సర్ కీ విడుదల



**న్యూఢిల్లీ, మే 27(మహ ప్రభ)**
యూపీఎస్‌సీ తొలిసారిగా సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష 2026కు సంబంధించి ప్రొవిజనల్ ఆన్సర్ కీని విడుదల చేసింది. ప్రిలిమ్స్ పరీక్షకు హాజరై ఇది కావాలని కోరుకునే అభ్యర్థులు upsconline.nic.in లో లభించే 'ఆన్‌లైన్ క్వశ్చన్ పేపర్ రిప్రజెంటేషన్ పోర్టల్ (క్యూపీరెప్)కు మే 31 సాయంత్రం ఆరు గంటల లోగా విజ్ఞాపనలను సమర్పించవచ్చునని అధికారులు తెలిపారు.ఇంతక్రితం సివిల్ సర్వీసెస్ ప్రాథమిక పరీక్షలకు సంబంధించిన తుది కీలను తుది ఫలితాలు, ఇంటర్వ్యూలు సహా కొన్ని నెలలు ఆలస్యంతో విడుదల చేసేది.

## టీఎంసీ ఆఫీసు సమీపంలో కరెన్సీ బస్తాలు

**-మట్టిలో పాతిన నోట్ల కట్టలు వెలికితీత**
**-నాలుగు బస్తాలలో కోట్ల విలువైన నోట్లు**



**కోల్‌కతా, మే 27(మహ ప్రభ)**
: పశ్చిమ బెంగాల్‌లోని బదురియాలో బుధవారం తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ కార్యాలయం సమీపంలో భూగర్భంలో పాతిపెట్టిన రూ. 500 నోట్ల కట్టలతో నిండిన సంచులను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రభుత్వ సహాయ సామగ్రి దుర్వినియోగం, అక్రమ ఆస్తులకు సంబంధించిన ఆరోపణల కేసులో టీఎంసీ సీనియర్ నాయకుడు, బదురియా మున్సిపల్ చైర్మన్ దీపాంకర్ భట్టాచార్యను అరెస్టు చేసిన అనంతరం జరిపిన సోదాల్లో ఈ నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.టీఎంసీ కార్యాలయం సమీపంలో అధికారులు ఆ ప్రాంగణం సమీపంలో తవ్వకాలు చేపట్టారు. తవ్వకాల సమయంలో రూ. 500 కరెన్సీ నోట్ల కట్టలతో నిండిన నాలుగు పెద్ద సంచులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదు కోట్లలో ఉండవచ్చని అధికారులు చెప్పారు.

## ఎండల గురించి కాదు పెరుగుతున్న ధరల గురించి మాట్లాడండి..

**-ప్రధాని మోదీకి ఖర్గే కౌంటర్**



**న్యూఢిల్లీ, మే 27(మహ ప్రభ)**
అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో దేశ ప్రజలకు ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల కీలక సూచనలు చేశారు. మంచి నీళ్లు బాగా తాగాలని, మధ్యాహ్నం సమయంలో అవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని, వడదెబ్బ తగిలినట్లుగా భావిస్తే నిర్లక్ష్యం వహించకూడదని ప్రధాని జాగ్రత్తలు చెప్పారు. అయితే మోదీ చెప్పిన ఈ జాగ్రత్తలపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. ప్రజలు అధిక ఉష్ణోగ్రతను తట్టుకోగలరని, కానీ బీజేపీ ప్రాయోజిత ద్రవ్యోల్బణాన్ని తట్టుకోలేరని అన్నారు.దేశ ప్రజలకు అధిక ఉష్ణోగ్రతల వలన కంటే ద్రవ్యోల్బణం వలననే చెమటలు ఎక్కువగా పడుతున్నాయని చురక అంటించారు. ప్రజలను బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం దోచుకుంటోందని, కానీ దీనిపై ప్రధాని మాట్లాడటం లేదని విమర్శించారు. ప్రజలు ఎండవేడిని తట్టుకోగలరని, కానీ బీజేపీ ప్రాయోజిత ద్రవ్యోల్బణం అనే మంటలవల్ల సామాన్య ప్రజలకు చెమటలు పడుతున్నాయని పేర్కొన్నారు. 'మీ ప్రభుత్వం చేస్తున్న దోపిడీ గురించి మీరెందుకు మాట్లాడటం లేదు మోదీజీ..?' అని ఖర్గే తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ట్వీట్ చేశారు.

## సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదుగురు జడ్జిలు



**న్యూఢిల్లీ, మే 27(మహ ప్రభ)**
నలుగురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాది వీ మోహనకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ బుధవారం కొలీజియం సిఫార్సు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ సారథ్యంలో కొలీజియం సమావేశాలు మే 22, మే 27 తేదీలలో జరిగినట్లు సుప్రీంకోర్టు వెబ్‌సైట్ తన తాజా ప్రకటనలో పేర్కొన్నది.పంజాబ్, హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ షీల్ నాగు, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ సచ్‌దేవ, జమ్ము కశ్మీరు, లద్దాఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ పల్లిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు సంఖ్యాబలం సీజేఐతో కలుపుకొని 32గా ఉంది. వచ్చే నెలలో ఇద్దరు సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులు ఉద్యోగ విరమణ చేయనున్నారు.

# రోడ్డు పై బైఠాయించిన రైతులు..

**-తూప్రాన్‌లో ఉద్రిక్త పరిస్థితి**
**"ధాన్యం కొనకపోతే ఇక్కడి నుంచే కదలము" అంటూ రైతుల ఆగ్రహం**
**-లారీలు లేక తడిసి ముద్దవుతున్న వరి ధాన్యం**
**-తూప్రాన్ ఐకేపీ సెంటర్ వద్ద బైఠాయించి నిరసన**
**-పోలీసులు, రెవెన్యూ అధికారుల హామీతో విరమణ**



**తూప్రాన్, మే 27.(మహాప్రభ)**
అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వేళ తూప్రాన్ ఐకేపీ సెంటర్ వద్ద రైతుల ఆగ్రహం చెలరేగింది. కొనుగోలు కేంద్రంలో రోజులు గడుస్తున్నా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం, లారీలు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం వర్షానికి తడిసి ముద్దవుతుండటంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.
బుధవారం ఉదయం పెద్ద సంఖ్యలో రైతులు ఐకేపీ సెంటర్ వద్ద చేరుకొని రోడ్డు పై బైఠాయించి ఆందోళన చేపట్టారు. "పంట పండించడానికి అప్పులు చేసి కష్టపడ్డాం.. ఇప్పుడు ధాన్యం తడిసి నష్టపోతుంటే అధికారులు పట్టించుకోవడం లేదు" అంటూ రైతులు మండిపడ్డారు.
వర్షం పడే అవకాశం ఉన్నప్పటికీ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయకపోవడం, సరిపడా లారీలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ధాన్యం రాశులు పూర్తిగా తడుస్తున్నాయని రైతులు ఆరోపించారు. ఇప్పటికే కొన్ని ధాన్యం కుప్పల్లో మొలకలు వచ్చే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల నిరసనతో కొంతసేపు తూప్రాన్ పరిసర ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డు పై రైతులు బైఠాయించడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్ రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే లారీలు ఏర్పాటు చేసి సీరియల్ ప్రకారం ధాన్యం లోడింగ్ ప్రారంభించారు.అనంతరం ధాన్యాన్ని గోదాములకు తరలించే చర్యలు చేపట్టడంతో రైతులు ఆందోళన విరమించారు.
అయితే ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి ఎదురవుతోందని, కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడం వల్ల రైతులే నష్టపోతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే అన్ని కొనుగోలు కేంద్రాల్లో లారీలు, టార్పాలిన్లు, నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.


## కూకట్‌పల్లి డిపోలో 60 ఈవీ బస్సుల ప్రారంభం.. ప్రజా రవాణాలో మరో ముందడుగు





**కూకట్‌పల్లి, మే 27 (మహాప్రభ):**
కూకట్‌పల్లి డిపోకు 60 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించిన సందర్భంగా ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో అనేక సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో 545 ఈవీ బస్సులు నడుస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 2,200 ఈవీ బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.
నగరంలో కొత్త కాలనీలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజా రవాణా వ్యవస్థను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు కొత్త బస్సుల కొనుగోలు ద్వారా మహిళలను యజమానులుగా నిలబెట్టామని రమేష్ అన్నారు. ప్రజా రవాణాలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కూకట్‌పల్లి డిపో విస్తరణలో భాగంగా ఐదు ఎకరాల స్థలంలో కొత్త డిపో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కూకట్‌పల్లి ప్రాంతాన్ని కాలుష్య రహిత ప్రాంతంగా మార్చేందుకు ఇకపై ఈవీ బస్సులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆర్టీసీ అభివృద్ధి కోసం ప్రతి ఉద్యోగి కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే కార్మికుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని హామీ ఇచ్చారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష



**హైదరాబాద్, మే 27(మహ ప్రభ)**
హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో 15 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు వడ్లూరి పవన్ (22)కు నాంపల్లి న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది.
ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది.
ఈ ఘటనపై బాధితురాలి తల్లి అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు నిందితుడిపై అత్యాచారం మరియు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆరోపణలు రుజువుకావడంతో నాంపల్లి న్యాయస్థానం నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది.
బాలలపై లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్న సందేశాన్ని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.

## ఘనంగా డిసిసి కార్యాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి




**కరీంనగర్, మే 27(మహ ప్రభ)**
కరీంనగర్ డిసిసి కార్యాలయంలో భారతదేశపు తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీతో కలిసి పోరాడిన జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్మారక కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం, అంజన్ కుమార్ మాట్లాడుతూ నెహ్రూ స్వాతంత్ర్య ఉద్యమంలో పదేళ్లకు పైగా జైలు జీవితం గడిపి దేశ స్వాతంత్ర్య సముపార్జనలో కీలకపాత్ర వహించారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ అభివృద్ధి కోసం పంచవర్ష ప్రణాళికలు, బాక్రనంగల్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి సాగు--తాగునీటి ప్రాజెక్టులు నిర్మించి, ఐఐటీలు, ఎయిమ్స్ వంటి విద్యా సంస్థలను స్థాపించడం ద్వారా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని వివరించారు.నెహ్రూ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని, పార్టీ కార్యకర్తలు ప్రజా సేవలో అదే మార్గంలో నడుస్తున్నారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎండి తాజ్, మడుపు మోహన్, ముత్యం శంకర్ గౌడ్, ఉప్పుల అంజనీ ప్రసాద్, సరిల్ల ప్రసాద్, వరాల నర్సింగం, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అహమ్మద్ అలీ, అబ్దుల్ రహమాన్, వంగల విద్యాసాగర్, సుమీన్ యాదవ్, మూల రవీందర్ రెడ్డి, రూపు రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గడప శ్రీనివాస్, సరిల్ల రతన్ రాజు, నిహాల్, కంకణాల అనిల్, విక్టర్, అమీర్, ఇమ్రాన్, కుంభాల రాజు కుమార్, శిల్ప, లాయికు, సత్తినేని శ్రీకాంత్, మేకల నరసయ్య, గడ్డం శ్రీరామ్, మంద మహేష్, మాజీద్ అలీ ఖాన్, వీరదేవేందర్, ఇమ్రాన్ గని తదితరులు పాల్గొన్నారు.జవహర్‌లాల్ నెహ్రూ సేవలను స్మరించుకుంటూ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

## బక్రీద్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష సమావేశం




**కరీంనగర్, మే 27(మహ ప్రభ)**
జిల్లాలో బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్, పోలీస్, పశుసంవర్ధక శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆమె, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. స్లాటర్ హౌస్‌ల వద్ద నిరంతర పర్యవేక్షణ, వ్యర్థాలను సక్రమంగా డంపింగ్ యార్డులకు తరలించడం, ఆవులు--దూడల వధ పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ పండుగ సందర్భంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, పశువుల అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.ప్రజలు ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయి.

# సర్ సక్రమమే!

మొదటి తరువాయి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించేందుకు ఈసీకి అధికారాలు ఉన్నాయని పేర్కొంది. 'ఎస్ఐఆర్ ద్వారా సాధించాలనుకుంటున్న లక్ష్యానికి, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలనే రాజ్యాంగ లక్ష్యానికి ప్రత్యక్ష సంబంధం ఉందని భావిస్తున్నాం. ఈ ప్రక్రియ ప్రస్తుత ఎన్నికల చట్టాలను ఉల్లంఘించడం లేదు. అంతేకాకుండా ఆర్టికల్ 324 కింద రాజ్యాంగ ఆదేశానికి జీవం పోస్తోంది. ఎన్నికల కమిషన్ తన చట్టబద్ధమైన అధికారాలను అతిక్రమించి వ్యవహరించందని చెప్పలేం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, మే 30 నుంచి 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో విడత, చివరి దశ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానుంది.

# అకాల వర్షాలు.. హై అలర్ట్!


మొదటి తరువాయి

ఉంచాలని సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

---

# చంద్రుడి దక్షిణ ధృవంపై మంచు!

చంద్రయాన్-2 డాటా ఆధారంగా గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు




న్యూఢిల్లీ:
ఇస్రో మరో మైలురాయిని అందుకుంది. చంద్రుడిపై నీళ్లు ఉన్నాయని తెలిపే కచ్చితమైన ఆధారాలను గుర్తించింది. చంద్రయాన్-2 డాటా సాయంతో అత్యంత శీతలమైన, రహస్యమైన చంద్రుడి దక్షిణ ధృవం వద్ద మంచు ఉన్నట్టు సైంటిస్టులు గుర్తించారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని గుర్తించినట్టు ఇస్రో తెలిపింది. చంద్రయాన్ 2 ఆర్బిటార్‌లోని డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపర్చర్ రాడార్ (డీఎఫ్ఎస్ఏఆర్) సాయంతో మంచును గుర్తించారు. దక్షిణ ధృవంలోని బిలాల అడుగున ఈ మంచు ఉన్నట్టు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇక్కడ 25 కెల్విన్ లేదా మైనస్ 248 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు ఉంటాయి. బిలియన్ల ఏండ్ల కిందినుంచే ఇక్కడ మంచు ఏర్పడ్డట్టు సైంటిస్టులు చెబుతున్నారు. చంద్రుడి ధ్రువప్రాంతాల్లో మంచు, నీరు ఉన్నాయనేందుకు తాజా ఆవిష్కరణ మరో బలమైన ఆధారంగా నిలువనున్నది.

# తెలంగాణలో తహసీల్దార్ల బదిలీ

మొదటి తరువాయి

తహసీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులకు తక్షణమే అమల్లోకి వచ్చేలా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్లు (డీఆర్ఓ), స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా కొత్త పోస్టింగులను కేటాయించారు. ఈ బదిలీలకు సంబంధించిన పూర్తి నివేదికను, అధికారులు విధుల్లో చేరిన వివరాలను ప్రభుత్వానికి తక్షణమే సమర్పించాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ తో పాటు సంబంధిత జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నూతన ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన వారిలో నిర్మల్ తహసీల్దార్ మోతీరామ్ ఎ. ను మంచిర్యాల డీఆర్ఓగా, కరీంనగర్‌కు చెందిన బి. రాజేశ్వరిని పెద్దపల్లి డీఆర్ఓగా, పెద్దపల్లికి చెందిన కె.వై. ప్రసాద్‌ను జగిత్యాల డీఆర్ఓగా నియమించారు. అలాగే వనపర్తి నుంచి ఆర్. పాండును నాగర్‌కర్నూల్ డీఆర్ఓగా, ఖమ్మం నుంచి వి. రవికుమార్‌ను ములుగు డీఆర్ఓగా, మేడ్చల్-మల్కాజిగిరి నుంచి జె. స్వామిని కరీంనగర్ డీఆర్ఓగా, నాగర్‌కర్నూల్ నుంచి ఎ. పాండును కామారెడ్డి డీఆర్ఓగా బదిలీ చేశారు. వీరితో పాటు జనగామ తహసీల్దార్ సిహెచ్. శ్రీకాంత్‌ను మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియమించగా, ఎం. సుదర్శన్ రెడ్డి (సూర్యాపేట) ను సిద్దిపేట ఎస్‌డీసీగా, ఎం. రమాదేవి (ఖమ్మం) ను నల్గొండ ఎస్‌డీసీగా, జి. కుమారస్వామి (పెద్దపల్లి) ను సిరిసిల్ల ఎస్‌డీసీగా, ఎన్. వెంకట్ రెడ్డి (కరీంనగర్) ను కరీంనగర్ ఎస్‌డీసీ (ఎల్ఏ) గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## 30న కర్ణాటకకు
# కొత్త సీఎం..

మొదటి తరువాయి



పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు సిద్ధరామయ్య తనకు చెప్పారని కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే ఆర్‌వీ దేశ్‌పాండే కూడా బుధవారం ధృవీకరించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య అధికార పోరు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ మార్పు జరగనున్నది.

## ఎస్--400 మిస్సైల్స్ రక్షణ
# వ్యవస్థలు మరిన్ని కావాలి..

రష్యాను కోరిన భారత్.. కొనసాగుతున్న చర్చలు



ఇండియా-- రష్యా మధ్య ఉన్న మైత్రి గురించి తెలిసిందే. రక్షణ, సాంకేతికత, చమురు, వ్యాపారం, వాణిజ్యం సహా అనేక అంశాల్లో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. ముఖ్యంగా భారత రక్షణ వ్యవస్థకు రష్యా తోడ్పాటునందిస్తూ వస్తోంది. ఇండియాకు అవసరమైన కొన్ని యుద్ధ విమానాలు, మిస్సైల్స్ వంటివి రష్యా సరఫరా చేస్తోంది. ఇండియాకు రష్యా అందిస్తున్న వాటిలో ఎస్--400 లాంగ్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ కీలకమైనవి.వీటిని అందించే విషయంలో 2018లో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. 5.4 బిలియన్ డాలర్ల ఒప్పందం మేరకు ఐదు ఎస్--400 క్షిపణి రక్షణ వ్యవస్థల్ని ఇండియాకు రష్యా అందించాలి. 2023 వరకు మూడు రక్షణ క్షిపణి వ్యవస్థల్ని అందించింది. ఇంకో రెండు ఎస్--400 మిస్సైల్స్ సిస్టమ్స్ ఈ పాటికే రావాలి. కానీ, రష్యాకు, ఉక్రెయిన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా వీటిని సమయానికి అందించలేకపోయింది. దీంతో ఈ వ్యవస్థల్ని త్వరగా అందించాలని రష్యాను ఇండియా కోరింది. అంతేకాదు.. మరిన్ని ఎస్--400 మిస్సైల్స్ డిఫెన్స్ సిస్టమ్స్ కొనుగోలు చేసేందుకు కూడా ఇండియా మొగ్గు చూపుతోంది. ఈ అంశంపై రష్యాకు చెందిన ఎఫ్ఎస్‌వీటీఎస్ (ఫెడరల్ సర్వీసెస్ ఫర్ మిలిటరీ-- టెక్నికల్ కోపరేషన్) సంస్థతో ఇండియా చర్చలు జరుపుతోంది. ఈ విషయాన్ని ఆ సంస్థ కూడా వెల్లడించింది. రష్యా నుంచి ఇలాంటి మరింత అదనపు వ్యవస్థల్ని కొనుగోలు చేయాలని ఇండియా భావిస్తోంది. ఇక మిగిలిన ఎస్--400 మిస్సైల్స్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను త్వరలోనే అందిస్తామని ఎఫ్ఎస్‌వీటీఎస్ చీఫ్ దిమిత్రీ షుగయేవ్ ఇటీవల తెలిపారు. నిజానికి ఇవి ఈ నెలలోనే రావాలి. కానీ, వచ్చే నవంబర్ నాటికి అందజేస్తామని తాజాగా రష్యా వెల్లడించింది. అలాగే, ఇండియా కోరినట్లు అదనపు మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ అందించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని దిమిత్రీ తెలిపారు. ఈ మిస్సైల్స్ సిస్టమ్స్.. రష్యా తయారు చేసిన అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థ. అంటే శత్రువులు ప్రయోగించి క్షిపణుల్ని గుర్తించి, గాలిలోనే ఈ వ్యవస్థ నాశనం చేయగలదు. దూరం నుంచి వచ్చే ఎయిర్‌క్రాఫ్ట్, డ్రోన్లు, మిస్సైల్స్, ఖండాంతర క్షిపణుల్ని ఇది అడ్డుకోగలదు. ఇండియా తన రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో వీటిని కొనుగోలు చేస్తోంది.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

మొదటి తరువాయి

జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తాం. ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదరటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

# నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు

మొదటి తరువాయి

ఒక వైపు మండుతున్న ఎండల వల్ల ప్రజలు వడదెబ్బకు గురవుతుంటే, మరోవైపు అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చిన పంటలు నేలపాలై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటున్నాయో అని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి వానలు బీభత్సాన్ని సృష్టించాయి. వరుణుడి దాటికి రైతుల బతుకులు అతలాకుతలం అయ్యాయి. రాగల నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు : తెలంగాణ రాష్ట్రంలో అనేక చోట్ల వడగండ్లతో కూడిన ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వేడిగా ఉన్న భూభాగం మీదకు తేమ గాలులు ప్రవేశించడం వల్ల అకాల వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వీటినే మేసకాలంలో కురిసే ప్రీ మాన్‌సూన్ జల్లులంటారని పేర్కొంది. రాగల నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఇవాళ ఆదిలాబాద్, కుమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నాయని తెలిపారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసినట్లు చెప్పారు. అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని వాతావరణ కేంద్రం వివరించింది. ఇవాళ, రేపు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో కొన్నింటికి రెడ్ అలర్ట్ జారీ చేశామని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు వివరించారు. చిరు జల్లుల వాతావరణం కొనసాగుతోంది : వేసవి కాలంలో భూభాగం బాగా వేడెక్కి 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నప్పుడు అదే సమయంలో విండ్ డైరెక్షన్లు మార్పులు వచ్చి తేమ గాలులు సముద్ర ప్రాంతం నుంచి భూ ప్రాంతాన్ని ప్రవేశించినప్పుడు మధ్యాహ్న సమయంలో క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడుతుంటాయని శ్రీనివాస్ రావు అన్నారు. దీంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, పిడుగుపాటు, వడగండ్ల వాతావరణం ఉంటుందని తెలిపారు. గత నాలుగైదు రోజుల నుంచి తెలంగాణలో హీట్ వేవ్ వాతావరణం ఉత్తర, తూర్పు తెలంగాణలో కొనసాగుతోంది. దక్షిణ, పశ్చిమ తెలంగాణలో చిరు జల్లుల వాతావరణం కొనసాగుతోందని వివరించారు. "నిన్న సుమారు 21 జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడ్డాయి. ఈరోజు తూర్పు, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉంది. నిన్న ఎక్కడైతే ఎక్కువ వర్షాలు పడ్డాయో అక్కడ ఈరోజు తక్కువ వర్షాలు పడే అవకాశం ఉంది. ఇవి హీట్ వేవ్ వర్షాలు కావడంతో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దీని ప్రభావం ఉంటుంది" అని వాతావరణ శాఖ అధికారి - శ్రీనివాస్ రావు, తెలిపారు.

## కల్లాల వద్ద
# దైన్యంగా రైతులు

మొదటి తరువాయి

పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేక సెల్‌ఫోన్‌ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచాలని దిశానిర్దేశం చేశారు. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధరకు (ఓ÷ూఖ) ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## అట్టహాసంగా టిడిపి
# మహానాడు ప్రారంభం

మొదటి తరువాయి

నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో 1851 క్లస్టర్లను పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక క్లస్టర్‌ను ÷ులినీ-చిజా కమ్యూనికేషన్ సిస్టమ్ ద్వారా నేరుగా అనుసంధానిస్తూ నాయకులు, కార్యకర్తలతో మమేకం కానున్నారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రతి క్లస్టర్‌లో భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మహానాడు ప్రత్యేకంగా 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళా సాధికారత, పార్టీ నిర్మాణంలో మహిళల పాత్ర, సామాజిక సేవలో మహిళల భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. అదేవిధంగా 'కార్యకర్తే అధినేత, యువగళం, పేదల సేవలో టీడీపీ' వంటి అంశాలపై కూడా కీలక చర్చలు జరుగనున్నాయి. మహానాడులో మొత్తం 10 కీలక తీర్మానాలపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు, పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. ఇప్పటికే మహానాడు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు, పసుపు జెండాలతో కేంద్ర కార్యాలయాన్ని అలంకరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభలను పార్టీ శ్రేణులు 'పసుపు పండుగ'గా అభివర్ణిస్తున్నాయి. ఉదయం 10:40 గంటలకు చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రసంగించారు. రాబోయే రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పనితీరు, పార్టీ బలోపేతం, యువత, మహిళల పాత్రపై పలువురు నేతలు కీలక సందేశాలు ఇచ్చారు. మహానాడు-2026 ద్వారా పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశర ఇవ్వడంతో పాటు, గ్రామస్థాయి కార్యకర్తలతో ప్రత్యక్ష అనుసంధానం పెంచడంపై టీడీపీ హై కమాండ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

# భక్తికి, త్యాగానికి, సహనానికి ప్రతీక 'బక్రీద్'

**-ముస్లిం సోదరసోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు**
**-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

**దేవరకొండ మే 27 ( మహాప్రభ )**
భక్తికి, త్యాగానికి, సహనానికి బక్రీద్ పండుగ ప్రతీక అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరసోదరీమణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని సూచించారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారని అన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే సందేశమన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.



## ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులను పరామర్శించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ మే 27 ( మహాప్రభ )**
ద్విచక్ర వాహనంపై నుండి ప్రమాదవశాత్తు గాయపడిన చందంపేట మండలం, కంబాలపల్లి గ్రామానికి చెందిన బుడిగపాక ఇద్దయ్య కుమారుడు పవన్ ని, దేవరకొండ మండలం, శేరిపల్లి పెద్ద తండాకు చెందిన యువకుడు మరియు చందంపేట మండలం, చీత్రియాలకు సంబంధించిన వారు హైదరాబాద్ బి ఎన్ రెడ్డి లైఫ్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని హాస్పిటల్ కి వచ్చి క్షతగాత్రులను పరామర్శించి, వైద్యులను మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకుదేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచించారు వారితో పాటు చందంపేట మాజీ ఎంపీపీ ఏడుపుల గోవింద్ యాదవ్ మరియు కోరుట్ల మాజీ సర్పంచ్ దొండేటి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముదిగొండలో ఘనంగా జరిగిన మహిళా వారోత్సవాలు

**- సూపర్వైజర్. డి. చిట్టెమ్మ**

**దేవరకొండ మే 27 ( మహాప్రభ )**
99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ముదిగొండ గ్రామంలో మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోసూపర్వైజర్ డి చిట్టెమ్మ మాట్లాడుతూ....కిశోర బాలికలకు మరియు బాలురకు వారి తల్లిదండ్రులకు ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల కలిగి అనార్థాలు మరియు పిల్లల హక్కులపై అవగాహన కల్పించారు.



18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు చట్టరీత్యా నేరం, బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామస్తులు తమ వంతు కృషి చేయాలని తెలియపరిచారు... అంజలి మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిసిన వెంటనే 1098 , హెల్ప్ లైన్ ద్వారా సమాచారం ఇవ్వాలని... తల్లి, తండ్రి లేని అనాధ పిల్లలకు ప్రభుత్వం వారి చదువు బాధ్యతలు తీసుకుంటుందని ఆమెతెలియపరిచారు.. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ విజేత,రమణ, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, వి బి కే దశరథం, గ్రామంలోని కిషోర్ బాలికలు తల్లులు గ్రామస్తులు పాల్గొన్నారు

## పిడుగు పాటుకు పాడి గేదె మృతి

**-150000 విలువ గల పాడిగెద మృతితో తీవ్రంగా నష్టపోయిన రైతు**
**-జీవనోపాధి కోల్పోయామని కుటుంబ సభ్యుల ఆవేదన**

**దేవరకొండ డివిజన్ మే 27( మహాప్రభ )**
దేవరకొండ పరిధిలో కొండమల్లేపల్లి మండల కేంద్రం గాజీనగర్ శివారు లో మంగళవారం కురిసిన అకాల వర్షానికి విషాద సంఘటన చోటుచేసుకుంది నల్లగాసు మల్లేష్ తండ్రి నారయ్య కు చెందిన వ్యవసాయ పొలం వద్ద పాడి గేద పైన పిడుగు పడడంతో గేద మరణించింది సుమారు 1,50,000 విలువ గల పాడిగేద మృతి చెందడంతో రైతు కుటుంబం తీవ్రంగా నష్టపోయారు వ్యవసాయం కూడా అంతంత మాత్రమే ఉన్న రైతు తనకున్న వ్యవసాయ పొలంలో గేదెలను సాకుతో పాలు అమ్ముతో జీవనోపాధి పొందుతున్న రైతు పిడుగుపాటుతో పాడి గేద మృతి చెందడంతో రైతు కుటుంబ సభ్యులు కన్నీటి పర్వతమయ్యారు పాడి గేద మృతి చెందడంతో తను జీవనోపాధి కోల్పోయామని ప్రభుత్వం తన ను ఆదుకోవాలని వేడుకుంటున్నారు



# విబి జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి

**-వారం వారం బిల్లులు చెల్లించి పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి**

**దేవరకొండ డివిజన్ మే 27 ( మహాప్రభ )**
చందంపేట మండల పరిధిలో చిత్రియాల గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల పొట్టగొట్టే వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్య లు కంబాలపల్లి ఆనంద్ కోరారు బుధవారం రోజున చందంపేట మండలం చిత్రియాల గ్రామంలో పని ప్రదేశంలో కూలీల సమస్యలు తెలుసుకొని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ . మాట్లాడుతూ యు పి ఏ -1 కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో సామాజిక భద్రత, వలసల నివారణలో భాగంగా, కమ్యూనిస్టు పార్టీలు పోరాడి సాధించిన జాతీయ ఉపాధి ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి విబిజి రాంజీ పథకం పేరుతో ఉపాధి కూలీల పొట్టగొట్టే చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ చట్టానికి వ్యతిరేకంగా వ్యవసాయ కూలీలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధి కూలీలకు పని ప్రాంతాల్లో కనీసం మంచినీటి సౌకర్యం కల్పించకపోవడం శోచనీయమన్నారు. ప్రథమ చికిత్స కిట్టులు లేకుండా, టెంట్లులేకుండా వ్యవసాయ కూలీలతో పనులు చేయించుకుంటున్నారన్నారు. ఐరిష్




పేరుతో పని ప్రదేశంలో సిగ్నల్ రాకపోవటంవల్ల పని ప్రదేశంలో నుండి అందరు ఇంటికి పోవటం జరుగుతుంది కొంతమంది కూలీలకు ముఖము పోటోవ్ రాకపోవటం నానా రకాలుగా ఉపాధి కూలీలు ఇబ్బంది పడుతున్నారు అన్నారు. మూడు నాలుగు గంటలు పని చేసిన తర్వాత ఐరిష్ రాకుంటే ఉపాధి కూలీలను ఇంటికి పంపుతున్నారని, ప్రత్యామ్నాయ మార్గాలు లేకుండా పని చేసిన తర్వాత కూడా ఇంటికి పంపడం చాలా దుర్మార్గం అన్నారు.ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు పని చేస్తున్నప్పటికీ కూలి గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సార్లు ఫోటోలు తీయడం వల్ల కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాఫ్టేర్ ప్రాబ్లం తో ఫోటోలు మ్యాచ్ కాకపోవడం వల్ల కార్మికులు పని నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ కే వై సి పేరుతో జాబ్ కార్డు తొలగించటం కొత్తగా పని కార్డు కోసం అప్లై చేస్తున్న వారికి జాబ్ కార్డు ఇవ్వడం లేదని కేవలం ఇందిరమ్మ ఇండ్ల సాంక్షన్ అయిన వారికి మాత్రమే ఇస్తామని సమాధానం చెబుతున్నారని, ఇది కార్మికుల పొట్ట కొట్టడమేనని అన్నారు. గత పది సంవత్సరాలుగా గడ్డపారలు, పారులు, తట్టలు లాంటి పనిముట్లు ఇవ్వడం లేదని వెంటనే వాటిని ఇవ్వాలని పని అడిగిన వెంటనే పనులు చూపాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా కూలీలపై కక్షగట్టి ఆ చట్టాన్ని రద్దుచేసి వీబీజీ రాంజీ చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. గత చట్టంలో కార్మికులకు ఉన్న సౌకర్యాలను ఈ చట్టంలో రద్దు చేసింది అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం 90% నిధులు ఇస్తే రాష్ట్రం 10% నిధులు ఇచ్చేది అన్నారు. కొత్త చట్టంలో కేవలం 60 శాతం మాత్రమే కేంద్రం ఇస్తుందని చెప్పడం ఉపాధి కూలీలను నట్టేట ముంచడమేనన్నారు. గత 12 సంవత్సరాలుగా బడ్జెట్లో ఉపాధిహామీ పథకానికి నిధులు కోత పెడుతూ వస్తుందన్నారు. ఈ బడ్జెట్లో ఆరు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేదలకు ఉపాధి కల్పించే బాధ్యతనుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకుంటుందన్నారు. పేదల పుట్టగొట్టే చట్టాన్ని తీసుకొచ్చిన బిజెపి ప్రజా ప్రతినిధులను ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ కూలీలందరూ బిజెపి తీసుకొచ్చిన విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని కొత్త జాబ్ కార్డు వెంటనే ఇవ్వాలని వారం వారం పేమెంట్ విడుదల చేయాలని రెండు సార్లు ఫోటో తీసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సభ్యులు రావుల వెంకటమ్మ సత్తమ్మ స్వాతి నలగంటి ముత్యాలు కాశమ్మ చాట్ల ఎల్లయ్య చెరుకు రంగయ్య పి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా విలేజ్ బుక్ కీపర్ (వివోఎ) మార్పు

**-కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు**

**దేవరకొండ 27మే (మహాప్రభ):**
నిబంధనల ప్రకారం ఏకగ్రీవంగా ఎన్నికై, గత ఆరు నెలలుగా విధులు నిర్వహిస్తున్న తనను కాదని, లంచాలకు ఆశపడి వేరే వ్యక్తిని విధుల్లోకి తీసుకువచ్చిన ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని చందంపేట మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన విలేజ్ బుక్ కీపర్ (వివోఎ) నాగిళ్ల రోహిణి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

బాధితురాలు నాగిళ్ల రోహిణి (భర్త రాఘవేందర్) తెలిపిన వివరాల ప్రకారం... పోలేపల్లి గ్రామంలో గత ఆరేళ్లుగా విలేజ్ బుక్ కీపర్ (వివోఎ) పోస్టు ఖాళీగా ఉంది. ఈ క్రమంలో గతంలో ఆమె పలుమార్లు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామ



పంచాయతీ వద్ద స్థానిక సర్పంచ్, మహిళా సంఘాల లీడర్లు, సంఘబంధం ప్రతినిధులు అందరూ కలిసి రోహిణిని ఏకగ్రీవంగా విలేజ్ బుక్ కీపర్‌గా ఎన్నుకున్నారు. ఈ ఎంపిక ప్రక్రియ నాటి ఏపీఎం జయప్రకాష్, సీసీ ఎల్లయ్యల ఆధ్వర్యంలోనే జరిగి, తీర్మానం కూడా చేయడం విశేషం. లంచం తీసుకుని అక్రమంగా మార్పు: గత ఆరు నెలల నుండి రోహిణి బుక్ కీపర్‌గా పూర్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎస్.హెచ్.జి ట్రాన్సాక్షన్స్ చూసుకోవడంతో పాటు, ఎం.ఎస్ ప్రతి మీటింగ్‌కు హాజరవుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని రకాల పథకాల అమలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.
అయితే, తన ప్రమేయం లేకుండా, తనకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ఏపీఎం జయప్రకాష్ వేరే వాళ్ల వద్ద లంచం తీసుకుని తన స్థానంలో మరొకరిని విధుల్లోకి రప్పిస్తున్నారని రోహిణి ఆరోపించారు. విధి నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఏపీఎం జయప్రకాష్‌పై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి, ఆయనను సస్పెండ్ చేయాలని, తనకు న్యాయం చేయాలని ఆమె కలెక్టర్‌ను వేడుకున్నారు.

# ఘనంగా టిడిపి జెండా ఆవిష్కరణ

**దేవరకొండ నియోజకవర్గం టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణయ్య**

**దేవరకొండ మే 27( మహాప్రభ)**
దేవరకొండ లో ఎన్టీఆర్ జయంతి వేడుకల సందర్భంగా తెలుగుదేశం పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జ్ వస్కుల కృష్ణయ్య గారు పార్టీ జెండా ఆవిష్కరించారు
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను మహానాడు వేదికగా ప్రతి సంవత్సరం మే 27, 28, 29 తేదీలలో ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు . ఎప్పటిలాగే జన్మదిన వేడుకలను నిర్వహించుకోవడానికి కొన్ని కారణాల



దృష్ట్యా ఘనంగా నిర్వహించలేక వర్చువల్ కార్యక్రమాల ద్వారా నిర్వహించుకుంటున్నామని, దానిలో భాగంగా బుధవారం దేవరకొండ లో పార్టీ జెండా ఆవిష్కరణ చేసి పార్టీ సంబరాలు నిర్వహించుకోవడం జరిగిందని అని తెలిపారు గురువారం ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. నందమూరి తారరామారావు తెలుగుదేశం పార్టీని ఏ ఆశయంతో స్థాపించారో, ఆ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రస్తుత జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని, తెలుగుదేశం పార్టీని తెలుగు ప్రజలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరూ గర్వించదగ్గ విధంగా నడిపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, నియోజకవర్గ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

## కైతలాపూర్‌లో 62 మంది నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు పంపిణీ

**కూకట్పల్లి, మే 27 (మహాప్రభ):**
కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని కైతలాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను 62 మంది నిరుపేద లబ్ధిదారులకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అందజేశారు. ఈ సందర్భంగా ఒక ఇంటిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛమైన త్రాగునీరు, మెరుగైన రహదారులు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల ఆర్థికాభివృద్ధికి ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు బస్సుల కేటాయింపు వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, కలెక్టర్ మనో చౌదరి తదితరులు పాల్గొన్నారు.



## తూప్రాన్‌లో విద్యుత్ శాఖ 'ప్రజాబాట' కార్యక్రమం నిర్వహణ

**తూప్రాన్, మే 27.(మహాప్రభ)**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ప్రజాబాట' కార్యక్రమం తూప్రాన్‌లోని లక్ష్మీ నర్సింహా ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, విద్యుత్ అంతరాయాలు, లైన్ సమస్యలు తదితర అంశాలపై స్థానిక ప్రజల నుంచి అధికారులు ఫిర్యాదులు, సూచనలు స్వీకరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు శాఖ కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేశ్వర్లు, ఫోర్‌మెన్ తిరుపతి, లైన్ ఇన్‌స్పెక్టర్ సహదేవ్, బాలయ్య, లైన్‌మెన్ కొండలు తదితర విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



# తెలంగాణలో పాఠశాల విద్యను గాలికి వదిలేసిన ప్రభుత్వం: ఏబీవీపీ

--ఫీజుల నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కి ప్రైవేట్ సంస్థల దోపిడీ

-సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు

-వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం: యలమల గోపీచంద్ హెచ్చరిక




**దేవరకొండ 27మే (మహాప్రభ):**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజున ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి అనంతరం ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర విద్యా విధానంపై ప్రెస్ నోట్ ఇవ్వడం జరిగింది. నీళ్లు నిధులు నియామకాల కోసం ఆనాడు ప్రత్యేక తెలంగాణ కొరకు ఎంతోమంది విద్యార్థులు బలిదానాలు అర్పించి విద్యార్థుల భవిష్యత్తు కోసం కోరుకున్న ప్రత్యేక తెలంగాణ లో ఈరోజు చూసుకున్నట్లయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను పూర్తిగా గాలికి వదిలేసింది ఎబివిపి రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు బ్రాండ్ల పేరిట ఫీజు నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కుతూ నర్సరీ విద్యార్థులకు లక్షల్లో ఫీజులను వసూలు చేస్తున్నారని పుస్తకాలు యూనిఫాం ల పేరిట ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల నుండి ఫీజు దోపిడీకి పాలు పడుతున్నారని, బస్సు సౌకర్యం పేరిట అడ్డదారిన వేలు రూపాయలను వసూళ్లు చేస్తున్నారని, ఫిట్నెస్ లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో, వసతి గృహాలు మాత్రం అరకొర వసతులు, సౌకర్యాలతో నరక కూపాల్లా ఉన్నాయి అని మరో రెండు వారాల్లో పాఠశాలలు పునః ప్రారంభం కాబోతున్న ఇంకా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఇచ్చే పాఠ్య పుస్తకాల ఊసు అసలే లేదని, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోతూ రోజు రోజుకు విద్యార్థుల సంఖ్య పడిపోతుంటే మరో వైపు ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా విస్తరించి విద్యను వ్యాపారం చేస్తున్నాయి అని ఈ విషయంలో పట్టించుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తుందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థల విద్యా వ్యాపారని అరి కట్టి, ప్రభుత్వ పాఠశాలను మెరుగు పరుస్తూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను, వసతి గృహాల వసతులను అభివృద్ధి పరిచి పాఠశాల విద్యలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని లేని పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా ఎబివిపి భారీ విద్యార్థి ఉద్యమం చేస్తుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎబివిపి నగర కార్యదర్శి పగిళ్ల విక్రం, నగర జాయింట్ సెక్రెటరీ రాకేష్, గుండాల శివరామరాజు, అరవింద్, శంకర్, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

## రామయంపేట బస్టాండ్‌కి పట్టిన దౌర్భాగ్యం

-అంధకారంలో మగ్గుతున్న రామాయంపేట బస్టాండ్

-అసాంఘిక కార్యక్రమాలకు నిలయమైన రామయంపేట బస్టాండ్



**రామాయంపేట మే 26 మహాప్రభ**
ఒకప్పటి ప్రాభవాన్ని కోల్పోయిన రామయంపేట బస్టాండ్ ఎన్నిసార్లు ఎన్ని వార్తలు వచ్చినా పట్టించుకోని అధికారులు దూర ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికుల అవస్తా కొంతమేర తీరిన రామయంపేట నుండి కామారెడ్డి వెళ్లే ప్రయాణికుల బాధ వర్ణనాతీతం మహాలక్ష్మి పథకంలో భాగంగా మిగతా అన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు బాగానే ఉన్నా ఒక రామాయంపేట కామారెడ్డికి మాత్రం చాలా దారుణంగా బస్సులు ఉన్నాయి వీటిని పరిష్కరించాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు బస్టాండ్లో పరిశుభ్రత మాట దేవునికి ఎరుక సాయంత్రం 7:00 నుండి కామారెడ్డి రామయంపేట్ కి ప్రజా రవాణా సౌకర్యం దాదాపు కనుమరుగు ఇక ముందైనా మన యువ ఎమ్మెల్యే గారు కొంచెం చొరవ తీసుకొని అధికారులను ఆదేశించాలని కోరుతున్న జనం ఇంతకుముందు ఉన్న కలెక్టర్ గారు సైకిల్ పైన వచ్చి బస్టాండ్ విజిట్ చేసిన మారని రాత నస్కల్ నందగోకుల్ పల్లెటూర్లకి బస్సు రవాణా సౌకర్యం రద్దు చేశారు తిరిగి రవాణా సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు


## ‘ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు పూర్తి చెయ్యాలి’

-తూప్రాన్-నర్సాపూర్ రహదారిపై రైతుల రాస్తారోకో




**శివంపేట, మే 27 (మహాప్రభ):**
శివంపేట మండలం చిన్నగొట్టిముక్కుల చౌరస్తా వద్ద రైతులు రాస్తారోకో చేపట్టారు. 20 రోజులుగా ధాన్యం కొనుగోలు సరిగా జరగకపోవడంతో, అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తూప్రాన్-నర్సాపూర్ ప్రధాన రహదారిపై రైతులు నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.

## శ్రీ మణికంఠ సెంట్రింగ్ సభ్యులతో మైసిగండి మైసమ్మ తల్లి దివ్య దర్శనం.



**ఎల్ బి నగర్ 27 మే (మహాప్రభ)**
శ్రీ మణికంఠ సెంట్రింగ్ సభ్యులందరితో కలిసి మైసిగండి మైసమ్మ తల్లి దివ్య దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, సంస్థ సభ్యులందరికీ ఆయురారోగ్యాలు, అభివృద్ధి, విజయాలు కలగాలని ప్రార్థించారు.
మైసమ్మ తల్లి ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ మా సభ్యులందరిపై ఉండాలని, సంస్థ మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నామని మణికంఠ సెంట్రింగ్ కాంట్రాక్టర్ ఆడాల గణేష్ తెలిపారు. సభ్యులందరూ భక్తి భావంతో కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు

## సిసి రోడ్డు నిర్మాణంకై ఎమ్మెల్యే హామీ



**గాంధారి, ఏప్రిల్ 30 (మహా ప్రభ)**
గాంధారి మండలం కేంద్రంలో నారాయణ గిరి కొండపై కొలువైన శివ భక్త మార్కండేయ మందిరం వద్ద సిసి రోడ్డు నిర్మాణాని కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, గాంధారి పద్మశాలి సంఘం కుల బాంధవులు బుధవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, మర్యాదపూర్వకంగా కలిసి శాలువా సన్మానం చేశారు. స్వయంగా ఆయననే త్వరలోనే సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపడతానని గుర్తు చేశారు. సంఘ సభ్యులు వర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ మండలఅధ్యక్షులు గుంటుకు అశోక్, అధ్యక్షులు క్యాతం కృష్ణ, ఉపాధ్యక్షులు సామల రాజు, కోశాధికారి తాటిపాముల శివ, కార్యదర్శులు, సామల విజయ్, కొమ్ములనారాయణ, శ్రీహరి, సంతోష్, శ్రీనివాస్, నర్సింలు, సంఘ పెద్దలు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మండల మహిళా సమాఖ్య ప్రత్యేక మహాసభ

-మహిళ శక్తి భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

-ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



**గాంధారి మే 27 (మహాప్రభ)**
గాంధారిలో మండల కేంద్రంలో మహిళా సమాఖ్య సర్వసభ్య మహాసభ ఘనంగా నిర్వహణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలోముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, మండల మహిళా సమాఖ్య సర్వసభ్య మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా శక్తి భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ మమ్మాయి రేణుక సంజీవ్ యాదవ్, మాజీ సర్పంచ్ సంజీవ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సీతాయపల్లి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు వసుంధర, మార్కెట్ కమిటీ చైర్మన్ పరమేష్, సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ జిల్లా డైరెక్టర్ సాయికుమార్, పాల్గొన్నారు. జిల్లా అధికారులు అడిషనల్ డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఎం నూకల శ్రీనివాస్, ఏపీఎం ప్రసన్నకుమార్, కార్యక్రమానికి హాజరై మహిళా సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలపై మాట్లాడారు...ఈ మహాసభలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పుష్పరాణి, మండల సమాఖ్య కార్యదర్శి అంబాలక్ష్మి, కోశాధికారి కవిత, సిబ్బంది, సీసీలు గొర్రె రాములు, రాజయ్య, కాశీనాథ్ గౌడ్, రమేష్, శేఖర్, సౌజన్య, అకౌంటెంట్ సుధాకర్, వివోఏ లు పాల్గొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మహిళా విజయానికి మహిళా శక్తి భవనాలు ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళా సంఘ భవనాల నిర్మాణానికి 40 లక్షల నిధులతో భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు



**గాంధారి, మే 27 (మహాప్రభ)**
గాంధారి మండల కేంద్రంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించనున్న 4 మహిళా సంఘ భవనాలకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్, భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్, మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘ భవనాల అవసరం ఎంతో కీలకమని తెలిపారు. గ్రామాల్లో పర్యటించిన ప్రతిసారి మహిళా సంఘ సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడానికి, సంఘ రికార్డులు భద్రపరచుకోవడానికి సరైన భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తన దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. మహిళల అభివృద్ధి, సంఘాల బలోపేతం కోసం ప్రతి గ్రామానికి మహిళా సంఘ భవనాలు మంజూరు చేయాలని అప్పుడే నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మహిళా సంఘ భవనాల నిర్మాణం కోసం సుమారు రూ.18 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే అనేక గ్రామాల్లో నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామానికి తక్కువ సమయంలోనే మహిళా సంఘ భవనాలు మంజూరు చేసిన ఎమ్మెల్యే మదన్ మోహన్, గాంధారి గ్రామ మహిళా సంఘ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కన్నతల్లిని హతమార్చిన తనయుడు అరెస్ట్



**మే 27 తిరుపతి జిల్లా (దొరవారి సత్రం) మహాప్రభ**
తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలంలోని చందనమూడి గ్రామంలో ఏప్రిల్ 25వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో తల్లిని హతమార్చిన తనయుడని పోలీసుల అరెస్టు చేసి రిమాండ్ కు పంపించడం జరుగుతుందని డీఎస్పీ చెంచు బాబు తెలియజేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆంబూరు సుజాత అను ఆమెపై తన పెద్ద కుమారుడు అయిన ఆంబూరు సుధీర్ తల్లి పై పెట్రోల్ పోసి నిప్పు అందించగా కాలిన గాయాలతో నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్ నందు తెల్లవారుజామున మరణించందని, మృతురాలి కుమారుడు అంబూరు సుధీర్ సాక్షాలను దాచిపెట్టి ఎవరికీ అనుమానం రాకుండా తన తల్లి ప్రమాదవశాత్తు మరణించినట్లుగా అందరినీ నమ్మించాడని, నేర స్థలములు క్షుణ్ణంగా పరిశీలించి క్లూస్ టీం, నేర స్థలములో అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను భద్రపరిచి దర్యాప్తు కొనసాగించి కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేసి ముద్దాయి అంబురు సుధీర్ ని అరెస్టు చేసి రిమాండ్ కు పంపించడం జరుగుతుందని డిఎస్పి చెంచు బాబు మీడియా సమావేశంలో తెలియజేశారు.

## చివరి గింజ వరకూ కొనుగోలు చేయాలి

--జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ 27 మే (మహాప్రభ)**
ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. బుధవారం మెదక్ మండలంలోని రాయలపూర్, కౌడిపల్లి మండలం కుల్చారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే బాయిల్డ్ మిల్లులకు తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు.సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ పర్వతాపూర్‌లో ఘనంగా దోతి సెర్మనీ కార్యక్రమం



**బోడుప్పల్, మే 27, (మహా ప్రభ)**
బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లి 9వ డివిజన్ పరిధిలోని పర్వతాపూర్‌లో ఉన్న డీబీఆర్ గార్డెన్‌లో బత్తుల రాములు గౌడ్ గారి మనవడి దోతి సెర్మనీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారిని దేశగోని శ్రీనివాస్ గౌడ్ (చైర్మన్ గీతా కార్మిక సంఘం) ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక వెంకటేష్ గౌడ్ మాజీ వార్డ్ మెంబర్, మునికుంట్ల నరేష్ గౌడ్ బీపీఎం కాలనీ అధ్యక్షులు, దుబ్బాక నర్సింహా దాస్ గౌడ్ (గౌడ సంఘం డైరెక్టర్), గూడెం సత్యనారాయణ గౌడ్, ఎర్ర నర్సింహా గౌడ్ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## సీతాయిపల్లి గ్రామ మహిళల సంఘ భవనం, అంగన్వాడీ భవనం నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మదన్ మోహన్



**గాంధారి మే 27 (మహా ప్రభ)**
గాంధారి మండలంలోని సీతాయిపల్లి గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న మహిళా సంఘ భవనానికి ఒ రూ.12 లక్షల నిధులతో నిర్మించనున్న అంగన్వాడీ భవనానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ గారు భూమి పూజ నిర్వహించారు.ఎమ్మెల్యే మదన్ మోహన్, మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళా సంఘ భవనాల అవసరం ఎంతో ముఖ్యమని తెలిపారు. గ్రామాల్లో పర్యటించిన ప్రతిసారి మహిళా సంఘ సభ్యులు తమ సమావేశాలు నిర్వహించుకోవడానికి, రికార్డులు భద్రపరచుకోవడానికి సరైన భవనం లేక ఇబ్బందులు పడుతున్నామని తన దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. అప్పుడే ప్రతి గ్రామానికి మహిళా సంఘ భవనాలు మంజూరు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు మహిళలు వర్షం వ్యక్తం చేశారు.

## వనదుర్గమ్మ సేవలో .. ఎమ్మెల్యే దంపతులు



**పాపన్నపేట మే27( మహాప్రభ )**
ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గమ్మను మెదక్ శాసనసభ్యులు రోహిత్ రావు,శివాని దంపతులు దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం వారు ఏడుపాయల కు చేరుకోగా ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు వన దుర్గా భవాని మాతను దర్శించుకొని ప్రత్యేక అర్చన, పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేసి ఆశీర్వదించారు. వీరికి ఆలయ సిబ్బంది శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. వీరి వెంట మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ గౌడ్,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు వెంకటేశం, సర్పంచులు శ్రీధర్, శ్రీను, నాయకులు భరత్ గౌడ్, ప్రసాద్ గౌడ్,ప్రవీణ్ గౌడ్,కిష్టయ్య,శివయ్య, ఖలీం,నర్సింలు,ఇంద్రసేన రెడ్డి, సూఫీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.


## ఏడుపాయల వన దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకున్న మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ దంపతులు.



**-మెదక్ జిల్లా, పాపన్నపేట మండలం, నాగ్సాన్ పల్లి.. మెదక్ జిల్లా -27మే (మహాప్రభ ).**
మెదక్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వన దుర్గా భవాని దేవస్థానాన్ని మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ గారులి తమ సతీమణితో కలిసి దర్శించుకున్నారు.
ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా డా. మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ ఏడుపాయల అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. దేవస్థాన అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తాం అని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మరియు మండల అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్స్ దేవస్థాన కార్యనిర్వహణాధికారి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## తక్వా & ఇఖ్లాస్‌తో కుర్బానీ---మానవత్వమే

**ఈద్ అల్-అధా సందేశం---మంజుల పత్తిపాటి.**



**ఆలేరు మే 27 (మహా ప్రభ)**
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజుల పత్తిపాటి మాట్లాడుతూ ఈద్ అల్-అధా పవిత్ర పండుగ కేవలం ఆనందోత్సవం మాత్రమే కాదని, ఇది తక్వా , సబ్ర్ మరియు త్యాగానికి ప్రతీక అని అన్నారు. ఈ పండుగ ద్వారా మనిషి తన అహంకారాన్ని కుర్బానీ చేసి, నఫ్స్ ను నియంత్రించుకోవాలని తెలిపారు. స్వార్థాన్ని విడిచిపెట్టి, ఇఖ్లాస్ తో జీవించే హృదయంలోనే అల్లాహ్ రహ్మత్ ఉంటుందని ఆమె అన్నారు.
మనిషిని మతంతో కాకుండా మనసుతో కొలవాలని ఈ పండుగ ప్రపంచానికి సందేశం ఇస్తోందన్నారు. ప్రపంచానికి ఇప్పుడు కావాల్సింది సంపద కాదు, ఇన్సానియత్ అని తెలిపారు.
క్రోధాన్ని రహ్మత్‌గా, ద్వేషాన్ని ముహబ్బత్‌గా, అహంకారాన్ని వినయంగా మార్చడమే నిజమైన ఇబాదత్ అని ఆమె పేర్కొన్నారు. అల్లాహ్ రహ్మత్, బరకత్, సలాం ప్రతి హృదయంలో నూరుగా నిండాలని ఆకాంక్షిస్తూ ఈ పవిత్ర పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

### పోలీసు ఉద్యోగ బాధ్యతల మధ్య కుమార్తెల

# భవిష్యత్తుకు బాటలు వేసిన నాన్న.

**-తండ్రి కలలకు రూపం ఇచ్చిన కుమార్తెలు.**
**-కష్టం, పట్టుదల ఉంటే ఏ లక్ష్యమైనా సాధ్యమే.**
**-ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచిన తాజుద్దీన్.**
**-ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఇద్దరు కుమార్తెలను ఘనంగా సన్మానించిన ఎస్పీడి. వి.శ్రీనివాస రావు ఐపీఎస్.**



**మెదక్ జిల్లా -27మే -(మహాప్రభ )**
కలలు కనడం ప్రతి ఒక్కరికీ సాధ్యం... కానీ ఆ కలలను నిజం చేయడానికి జీవితాన్నే అంకితం చేసే తల్లిదండ్రులు చాలా అరుదు. అలాంటి ఓ తండ్రి కష్టం, పట్టుదల, త్యాగానికి ప్రతీకగా నిలిచిన సంఘటన మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో హృదయాలను హత్తుకుంది.
మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎండీ తాజుద్దీన్ కుమార్తెలు డా. సమీరా సహేతాజ్, డా. సానియా సహేతాజ్‌లు ఎంబీబీఎస్ పూర్తి చేసిన సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ వారిని జిల్లా పోలీస్ కార్యాలయానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. చిన్న గ్రామమైన చేగుంటలో జన్మించి, సాధారణ కుటుంబ పరిస్థితుల్లో పెరిగిన ఈ ఇద్దరు కుమార్తెలు స్థానిక పాఠశాలలోనే చదువుకుని, అనంతరం ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లి కఠోర శ్రమతో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతంలో పరిమిత వనరులు ఉన్నప్పటికీ పట్టుదలతో ముందుకు సాగి వైద్య విద్యను పూర్తిచేయడం ప్రతి విద్యార్థికి ఆదర్శంగా నిలుస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు ఉద్యోగం అంటే నిత్యం ఒత్తిడి, బాధ్యతలు, కుటుంబానికి దూరంగా సేవలు. అలాంటి పరిస్థితుల్లో కూడా తన కుమార్తెల భవిష్యత్తు కోసం ఎండీ తాజుద్దీన్ చేసిన కృషి అభినందనీయము. తండ్రి కలలను పిల్లలు నిజం చేసిన ఈ ఘటన ప్రతి కుటుంబానికి స్ఫూర్తిదాయకం అని అన్నారు. సన్మాన కార్యక్రమంలో మాట్లాడిన డా. సమీరా సహేతాజ్, డా. సానియా సహేతాజ్‌లు భావోద్వేగానికి గురయ్యారు. మా కలలను నిజం చేయడానికి మా నాన్న ఎన్నో కష్టాలు పడ్డారు. పని ఒత్తిడి ఎంత ఉన్నా, మమ్మల్ని చదివించాలనే తపన ఆయనలో ఎప్పుడూ తగ్గలేదు. హైదరాబాద్ నుంచి మెదక్ వరకు రాత్రింబవళ్లు ప్రయాణాలు చేసినా, అలసటను బయటపెట్టలేదు. మాకు ధైర్యం చెప్పి, ముందుకు నడిపించారు అని కన్నీటి కళ్లతో తెలిపారు. మా కోసం తన సంతోషాలను పక్కన పెట్టి, మా భవిష్యత్తు కోసం ప్రతి క్షణం కష్టపడ్డారు. ఈ రోజు మమ్మల్ని సమాజం డాక్టర్లు అని గౌరవిస్తే... ఆ గౌరవానికి అసలైన అర్హుడు మా నాన్నే. మా విజయాల వెనుక ఉన్న ప్రతి కష్టం ఆయనదే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శైలెందర్, ఆర్ఎసై నరేష్, రైటర్ శ్రవణ్, సిబ్బంది ఉన్నారు.

# అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

**శివంపేట, మే 27 (మహాప్రభ):**
మెదక్ జిల్లా శివంపేట మండలంలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణ గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మా రెడ్డి ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం చండి గ్రామంలో స్థానిక సర్పంచ్ ప్రవీణ్ గౌడ్తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ గౌడ్ మాట్లాడుతూ రైతులు ఆరు నెలల పాటు కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్లే నేడు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. గత నెల రోజులుగా ధాన్యం కొనుగోలు సమస్యపై అధికారులను పలుమార్లు కలిసినా స్పందన లేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని తరలించకుండా కాలయాపన చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గత వారం రోజులుగా వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరిస్తూ వచ్చినప్పటికీ అధికారులు స్పందించలేదన్నారు. రాత్రంతా కురిసిన వర్షాలతో చెంది, దొంతి, చిన్నగొట్టుముక్కుల తదితర గ్రామాల రైతుల ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని తెలిపారు. ఇప్పటికే కొన్ని చోట్ల ధాన్యానికి మొలకలు రావడం ప్రారంభమైందని, 24 గంటలు ఆలస్యం అయితే పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శివంపేట మండలంలో 18 రైస్ మిల్లులు ఉన్నప్పటికీ కేవలం నాలుగు రైస్ మిల్లులకు మాత్రమే ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం వల్ల ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతోందన్నారు. మరిన్ని రైస్ మిల్లులకు అనుమతులు ఇస్తే కొనుగోలు ప్రక్రియ వేగవంతమవుతుందని సూచించారు. స్థానిక రైతుల ధాన్యం కొనుగోలు కాకముందే బయట ప్రాంతాల నుంచి ధాన్యం తీసుకురావడం వల్ల ఇక్కడి రైతులకు నష్టం జరుగుతోందన్నారు.
ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తడిసిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రమణ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

# సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం.



**మెదక్ జిల్లా -27మే (మహాప్రభ ).**
ఈ సమావేశంలో హరీష్ రావు పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేస్తూ పలు సూచనలు చేశారు:
ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు పూర్తి సహకారం అందించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు.నియోజకవర్గాల వారీగా నియమితులైన సమన్వయకర్తలు స్థానిక నాయకత్వంతో మమేకమై, ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు.
ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కొంత సమయం కేటాయించి గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు.
ఈసారి సాధారణ సభ్యత్వానికి రూ. 10, క్రియాశీలక సభ్యత్వానికి రూ. 50 రుసుముగా నిర్ణయించినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను పార్టీ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో చేపడుతోంది. స్పాట్‌లో లైవ్ ఫోటో తీసుకోవడంతో పాటు ఓటరు వివరాలు కూడా అక్కడే నమోదవుతాయి. దీని ద్వారా మెంబర్‌షిప్ డ్రైవ్ అత్యంత పారదర్శకంగా జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా ఈ మెంబర్‌షిప్ డ్రైవ్ పూర్తి చేస్తే.. అది రాబోయే ఎన్నికల్లో పార్టీకి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.ఉమ్మడి మెదక్ జిల్లాలో మనం ఇప్పటికే 7 స్థానాలు గెలుచుకున్నామని, వచ్చే ఎన్నికల్లో పదికి పది స్థానాలు సాధించేలా ఇప్పటి నుంచే పునాదులు వేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం, గ్రామాల్లో వడ్ల కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతున్నందున.. రైతులు, కార్యకర్తలకు ఇబ్బంది లేకుండా జూన్ మొదటి వారంలో సభ్యత్వ నమోదు శిక్షణా కార్యక్రమాలను ప్రారంభిద్దామని చెప్పారు. ఆన్‌లైన్ నమోదు విధానంపై నాయకులకు, కార్యకర్తలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ మెంబర్‌షిప్ డ్రైవ్ నూరు శాతం విజయవంతం కావడానికి స్థానిక ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డి, మాణిక్ రావు, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి, క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, మాజీ చైర్మన్లు ఒంటేరు ప్రతాపరెడ్డి, దేవి ప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, సమన్వయకర్తలు, మెదక్ జిల్లా మెంబర్షిప్ ఇన్‌చార్జి బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

### త్యాగమూర్తి రమాబాయి

# అంబేడ్కర్‌కు ఘన నివాళులు



**కూకట్పల్లి, మే 27(మహాప్రభ)**
దయారుగుడా అంబేడ్కర్ పార్క్‌లో రమాబాయి అంబేడ్కర్ 91వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్ఞానజ్యోతిని వెలిగించి ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పలువురు సామాజిక, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. జ్ఞానమాల కన్వీనర్ సింగూరు పాండు మాట్లాడుతూ రమాబాయి అంబేడ్కర్ త్యాగాలను స్మరించుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి రాజ్యాంగ నిర్మాతగా ఎదగడానికి రమాబాయి చేసిన త్యాగాలు ఎంతో గొప్పవని అన్నారు. కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత కష్టాలు ఎదురైనా ఆమె ధైర్యాన్ని కోల్పోలేదని పేర్కొన్నారు. జ్ఞానమాల కార్యదర్శి మద్దెల గిరి మాట్లాడుతూ, రమాబాయి అంబేడ్కర్ తన జీవితాన్ని కుటుంబం, సమాజం కోసం అంకితం చేశారని అన్నారు. దేశానికి రాజ్యాంగ నిర్మాతను అందించడంలో ఆమె పాత్ర చారిత్రాత్మకమని కొనియాడారు. కోట్లాది మంది ప్రజలకు ఆమె త్యాగం స్ఫూర్తిగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేకల రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్ద అనిల్ కిషోర్, సీనియర్ నాయకుడు సంజీవ్ తదితరులు పాల్గొని రమాబాయి అంబేడ్కర్‌కు ఘన నివాళులు అర్పించారు.

## నాగులపల్లిలో మహిళలు, బాలల రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం

**-ప్రజాపాలన ప్రగతి నివేదిక 99 డేస్‌లో భాగంగా ఉమెన్ వీక్ మూడో రోజు కార్యక్రమ**



**తూప్రాన్, మే 27,(మహా ప్రభ )**
ప్రజాపాలన ప్రగతి నివేదిక 99 డేస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఉమెన్ వీక్‌లో మూడవ రోజు నాగులపల్లి గ్రామంలో మహిళలు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు మరియు హెల్ప్‌లైన్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు, బాలికలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అందుబాటులో ఉంచిన 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 100 పోలీస్ అత్యవసర సేవలు, 181 మహిళా హెల్ప్‌లైన్ సేవల గురించి వివరించారు. అలాగే ,ాూూాం ాాష్–2013, గృహహింస నిరోధక చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో చట్టం వంటి కీలక చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మహిళలు మరియు బాలల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ బాల్య వివాహాలు, మహిళలపై హింసను అరికట్టేందుకు గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, డాక్టర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, గ్రామస్తులు, తల్లులు పాల్గొన్నారు. మహిళల భద్రత, బాలల సంక్షేమంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు.




## నాని కెరీర్‌లోనే
# 'ఆయా షేర్' రికార్డ్



'ది ప్యారడైజ్' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు అగ్ర హీరో నాని. 'దసరా'ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా విడుదలైన ఈ సినిమాలోని తొలి పాట 'ఆయా షేర్' నేటికీ సంచలనాలు సృష్టిస్తూనే ఉన్నదని మేకర్స్ తెలిపారు.తాజాగా ఈ పాట కేవలం తెలుగు వెర్షన్‌లోనే 150 మిలియన్ వ్యూస్, 1.6 మిలియన్ లైక్స్ సాధించి, నాని కెరీర్‌లోనే అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన పాటగా నిలిచిందని, సోషల్ మీడియానూ, పబ్లిక్‌ని ఈ పాట షేక్ చేస్తున్నదని మేకర్స్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పాటలో శ్రీకాంత్ ఓదెల సృష్టించిన రఫ్ అండ్ రస్టిక్ ప్రపంచం, నాని పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, డాన్స్ మూమెంట్స్ అందర్నీ ఆకట్టుకుంటున్నాయని, అనిరుధ్ ఎనర్జిటిక్ బీట్ పాటను మరో స్థాయికి తీసుకెళ్లగా, కాసర్ల శ్యామ్ సాహిత్యం, జంగిరెడ్డి, అర్జున్ చాందీ గానం ఈ పాటకు ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయని మేకర్స్ అంటున్నారు.

# జపాన్ అభిమానులకు షాక్ ఇచ్చిన పెద్ది..

## -రామ్‌చరణ్ సినిమా విడుదలపై కీలక నిర్ణయం



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన పాన్ ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్దిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ చిత్రాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్న జపాన్ అభిమానులకు ఇప్పుడు ఊహించని షాక్ తగిలింది. మొదట్లో చిత్రబృందం పెద్ది సినిమాను భారతదేశంతో పాటు జపాన్‌లో కూడా అదే రోజున విడుదల చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. గతంలో ఆర్ఆర్ఆర్ సినిమా జపాన్‌లో భారీ విజయం సాధించడంతో అక్కడ రామ్‌చరణ్‌కు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ సినిమా ద్వారా ఆయన నటనకు జపాన్ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది.ఒకవేళ అదే రోజు విడుదల జరిగి ఉంటే అంతర్జాతీయ బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో కలెక్షన్లు నమోదు అయ్యే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఇక పెద్ది చిత్రంలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.విడుదల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ సినిమాపై అంచనాలు పెరుగుతుండగా, జపాన్ విడుదల వాయిదా వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# కమల్‌హాసన్‌ను కలిసిన భాగ్యశ్రీ భోర్సే



కోలీవుడ్ నటుడు శివ కార్తికేయన్ 'సెయాన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కమల్ హాసన్ సొంత నిర్మాణసంస్థపై ఈ సినిమా రానుంది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తోన్న భాగ్యశ్రీ బోర్సే తాజాగా కమల్‌ను కలిశారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. డియర్ కమల్ హాసన్ సర్.. చిన్నప్పటినుంచి మిమ్మల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడు ఆ చిన్న అమ్మాయి మీ సినిమాలో నటిస్తోంది. మీరు నా తలపై చేయి వేసి ఆశీర్వదించిన క్షణాలను వర్ణించడానికి మాటలు సరిపోవు. మీరు గర్వపడేలా చేస్తానని ప్రామిస్ చేస్తున్నా అని భాగ్యశ్రీ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫోటో, ఆమె పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'అమరన్' విజయం తర్వాత శివకార్తికేయన్.. కమల్‌హాసన్ సొంత నిర్మాణసంస్థలో చేస్తున్న రెండో చిత్రమిది. శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్నారు. 'ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా. కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే భావోద్వేగాలు, మాస్ యాక్షన్, వినోదాన్ని మిళితం చేసుకుని ఉంటుందని టీమ్ తెలిపింది. ఈ సినిమా అక్టోబరులో థియేటర్లలోకి రానుంది.

# సమ్మర్ హాలిడేస్ టీజర్ విడుదల

ఏ మిడిల్ క్లాస్ బయోపిక్'తో అందరికీ చేరువయ్యాడు నటుడు రోహన్. ఈ సమ్మర్‌లో మరోసారి నవ్వులు పంచేందుకు వచ్చేశాడు. రోహన్, అరుణ్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సమ్మర్ హాలీడేస్'. శ్రీకర్ నాయన్ తెరకెక్కిస్తున్నారు. జయసుధ, వాసుకీ ఆనంద్, రాజీవ్ కనకాల కీలకపాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్ర బృందం పంచుకుంది.




Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com